అబద్ధాలు

'సాయంత్రం బండికి వూరెడుతున్నా' అన్నాడు రాజారావు.

"ఏ వూరు" అనడిగింది, ఆయన భార్య సునీత.

"ఇంకేవూరు? ఏటేటా ఏ ఊరెడుతున్నానో ఆ ఊరే – ఏముంది, పరీక్షలు – ఆ తంతు జరిపే భారం నామీదే తగులడుతుందిగా" అని కాస్తంత విసుగ్గా అన్నాడు.

"ఎలాగబ్బా – నాకు తోచదు. మళ్ళా చప్పునొచ్చెయ్యండి!"

"రాక అక్కడ చేసేదేముంది?"

సాయంత్రం బండికి ప్రయాణమయ్యాడు రాజారావు. ఆ ఊరు చేరుకునేటప్పటికి పదిగంటలైంది. తిన్నగా జట్కా బండిని జైళ్ళ సూపరింటెండెంటుగారి బంగళాకి పట్టించమన్నాడు. బండి దిగగానే గేటులో ఇద్దరు పోలీసులు అటకాయించారు. తను ఫలానా, ఫలానావారి కోసం వొచ్చానన్నాడు. లోపలికి తీసుకెళ్ళారు.

జైలు సూపరింటెండెంటు – నీలకంఠంగారు దీపం వెలుగులో ఏదో రాస్తూ కూర్చున్నాడు.

వరండాలోకి వెళ్ళగానే లేచి మందహాసంచేసి ఆహ్వానించాడు. పెట్టె, బెడ్డింగు ముందు గదిలో పెట్టించాడు. భోజనం సిద్ధం చెయ్యమని వంటాయనకి పురమాయించాడు.

"మీరు రావడం చాలా సంతోషం. పరీక్షల రోజులు, రావడం పడదేమో అనుకున్నాం నేనూ సుమిత్ర."

"చూచి చాలా సంవత్సరాలైంది. ఓసారి చూచిపోదామని ఎలాగో తీరికచేసుకొని వొచ్చిపడ్డాను" అన్నాడు రాజారావు. కాసేపు ఎవ్వరూ మాటాడలేదు. రెక్కల పురుగులు లాంతరుమీదపడి రోదిస్తున్నాయి.

"సుమిత్ర ఎప్పుడూ మీమాట చెబుతూంటుంది" అన్నాడు నీలకంఠం.

"ఏరీ, ఆమె కనిపించరేం?"

నీలకంఠం బిగ్గరగా నవ్వితేగాని నవ్వినట్లు గ్రహించడం కష్టం. మీసాలు దట్టంగా మూతిని కమ్ముకున్నాయి.

"క్షమాపణ చెప్పమంది – వాళ్ళ తమ్ముడికి పెండ్లి సంబంధం వొచ్చిందట. పిల్లని చూడ్డానికి ప్రొద్దున్నే వెళ్ళింది."

"అలాగా–"

మళ్ళా నిశ్శబ్దం.

"మిసెస్ రాజన్‌ను కూడా తీసుకురాలేకపొయ్యారా?" అని అడిగాడు నీలకంఠం.

"మీరు మరిచిపొయ్యారేమో! నా పేరు రాజారావు, మా ప్రిన్స్‌పాల్ రాజన్."

"అవునవును, అన్నట్టు రాజన్ ప్రిన్స్‌పాల్. ఏమిటో ఈ రెండు పేర్లు ఎప్పుడూ – కలిపేస్తూవుంటాను. నే నాయన్ని ఎరగననుకోండి. మా సుమిత్ర ఆయన దగ్గర చదువుకుంది. అవునవును – రాజారావు – మా సుమిత్ర మీ విషయం తరచు చెబుతూంటుంది."

"అవును, ఆమె నేనూ ఇంటర్ ఒకే కాలేజీలో చదివాం. ఆవిడ నోట్సు లేకుంటే నేను ప్యాసయ్యేవాడినే కాదు" అన్నాడు రాజారావు.

"ఏం చదువులు? ఇంటర్ ఇంతవరకూ ప్యాసవనే లేదు. పరీక్షకి కట్టమంటే వినిపించుకోదు. తరువాత మాట్లాడుకుందాం. భోజనము కానివ్వండి..." లాంతరు టప్‌మని ఆరిపోయింది.

రాజారావు భోజనానికి వెళ్ళాడు. అతనికి నవ్వొచింది. రాజన్‌కి పంపిన ఆహ్వానం పోస్టువాడు తనకిచ్చాడు. సుమిత్రా తనూ కలిసి చదువుకున్నారు. సుమిత్ర వివాహానికి తను వెళ్ళాడు. ఇంకా జ్ఞాపకం ఉంచుకొని తనను ఆహ్వానించిందనుకుని ఎంతో సంతోషించాడు. ఇప్పుడా సంతోషానికి ఆస్కారం లేదు. పాపం నీలకంఠం చమత్కారంగా మాట తప్పించి సర్దేశాడు. రాజారావుకి చిన్నతనంగా ఉంది. ఆ రాత్రి ఎల్లాగో గడిపి, ప్రొద్దున బండికి బిచాణా ఎత్తేద్దామనుకున్నాడు.

భోజనంచేసి వరండాలో కొచ్చాడు.

"ఉదయం మాట్లాడుకుందాం. అల్లా ఆ గదిలో పడుకోండి – ప్రయాణం బడలిక ఉంటుందిగా మరి. నేను ఈ ఆఫీసు కాగితాలు చూచుకుంటూ వుంటాను" అన్నాడు నీలకంఠం.

బ్రతుకు జీవుడా అనుకుని, రాజారావు వరండాలో పచార్లు సాగించాడు. హాల్లో దీపం తన గది కిటికీలోంచి కళ్లలోకి పొడుస్తోంది. దాన్ని తగ్గిద్దామని రాజారావు హాల్లోకెళ్ళాడు. హాల్లో రెండు సోఫాలు, కార్నర్ టేబిల్సు, మూడు కుర్చీలు వున్నాయి. గోడని ఫోటోలు, బొమ్మలు తగిల్చి వున్నాయి. దీపం వెలుగులో ఫోటోలకేసి చూశాడు. తనూ, సుమిత్రా వున్న కాలేజీ ఫోటో చూశాడు. అప్పటికి ఇప్పటికీ తనలో ఎంతో మార్పుంది! కొంచెం లావెక్కాడు. జుట్టు నుదుటిమీద నుంచి వెనక్కి జారింది; వొత్తు తగ్గింది. కండ్లక్రింద నల్లగీతలున్నాయి. సుమిత్ర తననిచూసి ఏమనుకుంటుందో! తనని ఆమె చూడనందుకు సంతోషించాడు. సుమిత్ర ఆ రోజుల్లో కాలేజీకి "జ్యూలియెట్". ఆవిడున్న సెక్షన్‌లో వుండి చదువుకొంటున్న విద్యార్థులు ధన్యులుగా ఎంచబడేవారు. వారితో మాట్లాడి, వారి పరిచయం పొందడానికి మిగతా విద్యార్థులు ఉబలాటపడుతుండేవారు.

రాజారావు ఆమెవద్దనుండి నోట్సు తీసుకున్నందుకు కథానాయకుడయ్యాడు. నిట్టూర్చి తిరిగి నోట్సు ఆమె కిచ్చేశాడు. అతను, జీవితంలో మధురంగా వొదిలిన నిట్టూర్పు అదొక్కటే. అదొక మరపురాని అనుభవం. అతనింతవరకూ ఆ నిట్టూర్పు విషయం ఎవ్వరికీ చెప్పలేదు. పైగా భార్యతో అబద్ధమాడాడు. నోట్స్ పుచ్చుకుంటూ, సుమిత్రే నిట్టూర్చిందని. చిన్న అబద్ధమే. కాని, దాన్ని పురస్కరించుకొని, భార్య అతన్ని ప్రతిరోజూ ఒక్కమారేనా దెప్పిపొడుస్తూంటుంది. తరువాత అంతా వొట్టిది, నిట్టూర్పు లేదు గిట్టూర్పు లేదు – అంటే, భార్య నమ్మదు. ఇదెక్కడి కర్మ. అబద్ధం నమ్ముతారు ఆడవాళ్ళు అనుకున్నాడు. ఎప్పుడూ అబద్ధమాడకూడదనుకున్నాడు.

ఏం లాభం? అబద్ధమాడి ప్రయాణం కట్టాడు. ఆహ్వానం రాగానే అది తనకి కాదనీ, ప్రిన్సిపాల్ రాజన్‌కి ఉద్దేశించబడిందనీ అతనికి స్ఫురించింది కూడా. తనకే ఎందుకవగూడదని ఆత్మవంచన చేసుకొని, సమాధానపడి సుమిత్రకి తను జ్ఞాపకం ఉన్నందుకి గర్వించి, కొండంతై, ఎక్కడలేని ఉత్సాహాన్ని తెచ్చిపెట్టుకుని, భార్యతో చీఫ్

ఎగ్జామినరుగా వెళ్ళాలని వొంకెట్టి సుమిత్రని చూడడానికోసం ప్రయాణమయాడు. ఇందుకోసమని చెబితే భార్య ఓ పక్షాన రానిచ్చునా! అసలింట్లో బ్రతకనిస్తుందా! ఒక మంచి కార్యంకోసం, తన సంతోషంకోసం, ఇదొక్కటే అతనాడిన అబద్ధం ఇంకెప్పుడూ ఆడను అని తీర్మానించుకుని, ఆ ఫోటోని గోడకుతగిల్చి, నిట్టూర్చి, తన గదిలోకొచ్చి పడుకున్నాడు.

రాజారావుకి నిద్రపట్టలేదు. బద్ధకంలో, అలుపులో స్పష్టమైనకలలో ఏవో నిట్టూర్పులు.

తెల్లవారింది.

ఎనిమిదైంది.

నీలకంఠం గుమాస్తా గదిలోకొచ్చాడు. తనే పరిచయం చేసేసుకున్నాడు.

"నమస్కారం – రాజారావుగారు... మీరొచ్చినందుకు సంతోషం?"

నాపేరు మీకెట్లా తెలుసు?"

"నీలకంఠంగారు చెప్పారు. అసలు విషయం మనవిచేస్తున్నా ఆహ్వానాలు పంపమని అడ్రెసుల జాబితా ఇచ్చారు. కొన్ని అడ్రెసులు మావాడొకడు వ్రాశాడు. ఆ రాయడంలో మీకని ఉద్దేశించిన ఆహ్వానంపై ప్రిన్సిపాల్ రాజన్ అని వ్రాసినట్టున్నాడు. అవి నీలకంఠంగారు చూసీ అమ్మగారికిచ్చారు. ఆవిడ, ఎరుగున్న వాళ్ళకి కొన్ని పంపుకున్నారులెండి. అడ్రెసు ఆవిడ సరిగ్గారాసి, పోస్టుచేయించారన్నమాట. వొస్తా, తొందరపన్లున్నై. మధ్యాహ్నం పంక్షన్‌లో కలుసుకుందాం" అంటూ వెళ్లిపోయాడు.

రాజారావు కేమీ అర్థంకాలేదు. ఆహ్వానం తీసి చూశాను. 'ప్రిన్సిపాల్' అని లేదు. ఎవరో 'రాజన్'ని 'రాజారావు' అని దిద్దారు. అది సుమిత్ర పనే అయివుంటుంది. నీలకంఠం తనని 'రాజన్' అని ఎందుకనుకున్నాడో ఇప్పుడు తెలుస్తూంది. 'రాజన్' కన్నడ ప్రాంతీయుడైనా చాలామంది తెలుగువాడిగా భావించి, "రాజారావని" వ్రాసిన ఉత్తరాలు ఇదివరలో చాలాసార్లు "రాజారావు" అందుకుని ఆయనకి ఇచ్చివేస్తూండడం జరిగేది.

అవుతే "ప్రిన్సిపాల్" అని ఎందుకులేదో అతనికి బోధపడలేదు. ఆ, ఇప్పుడు బోధపడింది. రాజన్‌కి పంపిన ఆహ్వానం రాజన్‌కి చేరే వుంటుంది. సుమిత్ర తనకి వేరే ఆహ్వానం పంపి ఉంటుంది. కాబట్టి, సుమిత్ర తనని ఆహ్వానించినట్లుగా భావించొచ్చు. అవుతే వొక రహస్యం ఉంది. ఈ సంగతి ఆమె భర్తకి తెలియపర్చలేదు. కారణం?

ఏమో అతని గుండెలు దడదడ కొట్టుకున్నాయి. ఆలోచించే వ్యవధిలేదు. డిప్యూటీ సూపరింటెండెంటు ఆఫ్ పోలీసు దినకరంగారు చక్కావొచ్చాడు. నీలకంఠం రాజారావుని పరిచయం చేశాడు. ఆయన షేక్‌హాండ్ ఇచ్చాడు. రాజారావు చెయ్యి గట్టిగానొక్కి ఊపేశాడు. దెబ్బతో వేళ్ళు నలిగిపొయ్యాయి. ఉద్యోగం హోదాలోని మజా అంతా షేక్‌హాండ్‌లోనే వుంది.

వారి సంభాషణలు రాజారావుకు అర్థంకాలేదు. ట్రాన్సుఫర్లు ప్రమోషన్లు, పార్టీలు రాజకీయాలు – ఆ వాతావరణంలో ఇతనికి స్థానంలేదు. వారంతా ఆర్థికంగా పై అంతస్థు మీదివారు. అసలతనిక్కడికి రావడమే బుద్ధి తక్కువనిపించింది.

వొచ్చేకార్లు, వెళ్ళేకార్లు, జనంగడబిడ, పూలమాలలు, 'బొకే'లు, కుర్చీలు, బెంచీలు, దవాలి బంట్రోతులు, పోలీసులు, – లారీలు, జనం పది, పదకొండు – ఎవరో అతన్ని భోజనానికి లాక్కుని తీసుకెళ్ళారు.

భోజనం అయింది.

మళ్ళా గదిలో కొచ్చిపడ్డాడు.

ఈలలు – పెద్ద కేకలు, చట్టున అంతా నిశ్శబ్దం. అతన్ని లారీలో ఎక్కమన్నారు.

"ఎక్కడికీ?"

"జైలుకి"

"ఎందుకు?"

నవ్వులు!

"పంక్షన్‌కి రారూ?"

"అవునవును"

లారీలో ఎక్కాడు జైలు ఆవరణలో దిగాడు. ఖైదీల చేతిపరిశ్రమలను పౌరులకి చూపించే నిమిత్తమై ఏర్పాటైన సమావేశం అది. జిల్లా కలెక్టరు అధ్యక్షుడు. ఖైదీలు అల్లిన బుట్టలు చాపలు, కాళ్ళపీచులు, నవారు, కఱ్ఱసామాను, ఇవన్నీ పెద్ద హాల్లో అమర్చబడి ఉన్నాయి. సూట్లలో ఆఫీసర్లు కుర్చీలలో కూర్చున్నారు. స్త్రీజనం, పూలు, సెంట్ల పరిమళం సిల్కుచీరలు గాలిలో చేసే చప్పుడు. అలా చూస్తూ నిలబడగానే పెద్ద కేకలు, విజిల్సు – లారీనిల్చిన చప్పుడు. అందులోంచి ఖైదీలు దిగారు. అందరూ వరుసగా నిలబడ్డారు. కొందరు లారీలోనే ఉండిపోయారు. లారీని దూరంగా లాగేశారు. అందులో ఉన్న ఖైదీలు కూడా దిగిపొయ్యారు. ఒక్కడే మిగిలిపొయ్యాడు. అతని మొహం ఎక్కడో చూసినట్లనిపించింది రాజారావుకి. జ్ఞాపకం వొచ్చింది – చంద్రన్న.

చంద్రన్నది రాజారావు అత్తవారి ఊరు. ఒకటి రెండు మార్లు అతను తోలే జట్కాబండిలో భార్యాసమేతంగా పొరుగూరిలో సినిమాకి వెళ్ళాడుకూడా. చంద్రన్నని గురించి – బోలెడు కథలున్నాయి. చాలా మొండివాడు. ధైర్యశాలి. ప్రాణాలకి తెగించి ఏపనైనా చేసిపారెయ్యగలడు. రౌడీకూడా. స్త్రీల జోలికి పోడట. పోలీసులకి అతనంటే బెదురట. చిన్న చిన్న నేరాలకి – ఎవడిదో చెయ్యి విరగొట్టడం, మోకాలు కిందకత్తిపోటు – ఇల్లాంటి వాటికి జైళ్ళల్లో ఉంచడం, వొదిలెయ్యడం జరిగింది. రెండు మూడు ఖూనీకేసులుకూడా అతని పనేనని పోలీసులు నమ్మినా, తగినంత సాక్ష్యం దొరక్క అతన్ని శిక్షించడానికి వీలుపడింది కాదు.

కొన్ని వారాలపాటు మనిషి మాయమవుతాడుట. మళ్ళా సద్దంతా మణిగింతర్వాత ఆ వూళ్ళోకి సిద్ధమవుతాడుట.

రాజారావు అత్తవారింట్లో అతనికి చనవుజాస్తి. ఎన్నో మార్లు అక్కడే భోజనంచేసి పడుకునేవాడు. ఒకసారి చేలో పనిచేస్తుండగా, అతని కఱ్ఱ తగలగా త్రాచుపాము అతని మీదికి లేచిందట. అతను చేతిలోని కఱ్ఱని మట్టిలోపాతి, తన పాగా కఱ్ఱమీద తగిల్చాడుట. పాము ఆ కఱ్ఱని కాటేస్తుండగా ఇతను పరుగెత్తుకుపొయ్యాడుట. చంద్రన్న సాత్వీకుడిలా కనిపిస్తాడు. వెఱ్ఱిబాగులవాడు. డబ్బు కాపీనం బొత్తుగాలేదు. బీడీలు కాలుస్తాడు – ఎప్పుడేనా తాగుతాడు. వేరే వ్యసనాలేమీ లేవు.

రాజారావు చంద్రన్న లారీకేసి వెళ్ళాడు. గుంపులో జనం వెన్నులు లారీ వెంపుకున్నాయి. అంతా ఆ గంద్రగోళంలో పడిపోయారు. చంద్రన్న కళ్లు మూసుకుని, కునికిపాట్లు పడుతున్నాడు.

"చంద్రన్నా!"

ఉలిక్కిపడి లేచి కళ్ళు నులుముకున్నాడు.

"మీరాండి - ఈ రొంపిలో కొచ్చారేంటి?'

"జైలు సూపరింటెండెంటుగారు అంటే - కొంచెం వార్నెరుగుదున్లే పిలిస్తే వొచ్చాను" అన్నాడు రాజారావు.

"ఏదేనా సాక్షానికాండి?"

"అబ్బే - ఇదిగో, ఈ పంక్షన్ అవుతోందే, చూసి పోదామని"

"ఇదంతా వో తంతులెగండి. ఏదో కూతంత పొద్దోతుంధి. రాములోరి ఉడతకిమల్లే నాను ఏదో చేసినాను" అని నవ్వాడు చంద్రన్న.

"నువ్వు మళ్ళా జైల్లో కెందుకొచ్చావ్?"

'నే నెందుకొత్తాను. ఈడేంపని? ఆళ్ళే బలాత్కారంగా లాక్కొచ్చిపడేశారు. నాయెదంగాళ్ళు.'

"ఏం జరిగిందేమిటి?"

"మీ కేం తెలుత్తవండి మా మాయగొడవలు. మాయింటిది రత్తి - అల్లదో, రెడ్డిసత్తయ్యా నెరగరండీ - పుగాకు యాపారం, ఆడుదీనెంట పడినాడంట. అదంతా వుత్తిదిలెగండి. ఆడది అలుసీయకపోతే ఏ మొగపక్షిగాడి మీసం లెగుత్తుందండి - ఎటైతేనేంలెగండి. ఆడుదానెంట పడితేనేం, ఇదాడెంట పడితేనేం. ఇద్దరూ ఆట్లు సాగించారు. నా కళ్ళ పడిందండీ. ఏంపనే కుక్క పని అని కూత్తంత కసిరానండి. రెడ్డిసత్తయ్య లగోలగు దౌడెత్తినాడు, శనిపక్షిగాడు. మా రత్తికూతరంటుందే - "నే నీడ సాపేసి తొంగున్నా. ఆడొచ్చి ఎగబడి సరసమాడబోతుంటే, ఏటిది సత్తెయ్యా, నా మొగోడు సూత్తే, నన్ను సీరెత్తాడన్నాను. ఆడు ఇనిపించుకోకుండా రగడ సాగిత్తుంటే, నువ్వొచ్చినా - ఇంతేనని" అన్నదండి. నాకు మా చెడ్డ తట్టుగా లేసుకొచ్చిందండి ఎందుకంటారా! రత్తి అబద్ధమాడిందండీ - అది మరో పరాయి శనిగాడితో వుందని నాకు తెలిత్తే నేను దాన్ని సంపి సీరి ఎండేత్తానంట. నాయంత మంచివోడు భూ పపంచంమీదుండా డంటారా! నే నట్టాంటివోణ్ణి కానని తెలుసు. అంటే అబద్ధమాండిందన్న మాటేగా - నూరు సెప్పండి, ఎయ్యి సెప్పండి - నాలిక పదును, మాటనిలకడ కత్తిదెబ్బ సమమండి. ఆ మట్టున నే నన్నా "ఓ సెర్రిమొగమా, నువ్వేయాలుగాడితో లేసెడితే నాకెంతుకే. ఆడితో నాగురించి ఎందుకబద్ధమాడినా సెప్పు" అన్నానండి. నోరెల్లబెట్టింది గుంట. ఛూత్ అబద్ధం ముదరష్టం పిల్ల."

చంద్రన్న కాండ్రించి ఊశాడు. జనం చప్పట్లుకొడుతున్నారు. కప్పులు, సాసర్లు, చిల్లర చప్పుళ్ళు వినబడుతున్నాయి.

"తరువాతేం జరిగింది?"

"ఏం జరుగుద్దండి - అంతే అబద్ధమాడినందుకు నాకు శివ మెత్తిదవడ మీద డోలు మోగించాను. లమ్మోనని పడిందండి. నాటకం తొక్కుతుంది కాబోసనుకుని బైట కెళ్ళానండి. గంటయాక, రంగమ్మ గురకవేసుకుంటూ వొచ్చి, రత్తి సచ్చింది మావో... అంటో ఏడుపు లంకించుకుంది. కరణంగోరు, పోలీసోరు, సాక్షికాలు లాక్కొచ్చి ఈడపడేశారు ఆళ్ళకేదో మిస కావాలి. ఇద్దొరికింది; పట్టండెహె అన్నారు. పట్టుకున్నారు," చంద్రన్న నవ్వు మీసంకిందనుంచి కనబడుతుంది.

"అవుతే చంపానని వొప్పేసుకున్నావా?"

"నే నొప్పుగోనండి, నేను సంపందే. దానికి గుండెదడ జబ్బుంది. దవడ పగలేసినమాట సొయానా నిజం. తట్టుకోలేక సచ్చింది. నాకాడ అబద్ధాల బతుకు సాగదండి. నాపేరెంట తెల్సునాండీ? అరిచెంద్రుడు. మా అమ్మ అట్టాగే పిలిసేదండి సిత్రం – మా వూళ్ళోనే గొట్టికాయలాడే వాణ్ణి. కుర్రతనం. దాసరి బసవయ్య వాళ్ళు అరిచెంద్ర నాటకం ఆడినారు నే సూశానండి. పెళ్ళాన్ని కత్తెత్తి సంపబోతాడండి, ఆ యమ్మ అబద్ధ మాడింది గనకనే. ఆకాడనుంచి, ఛీ, అబద్ధం గూడదు అని ప్రమాణం చేసుకున్నానండి."

రాజారావు ఏదో అడుగుదామనుకుంటుండగా జనం కదలడం మొదలెట్టారు. మళ్ళా విజిల్సు, కార్లు, కేకలు, గంద్రగోళం బయలుదేరింది. పంక్షన్ అయిపోయింది. ఖైదీలని లారీలో కెక్కించి వేశారు. జనం పల్చబడ్డారు. కుర్చీలు, బల్లలు, కప్పులు సాసర్లు చిందరవందరగా ఉన్నాయి. నేలమీద పూలు, సిగరిట్‌ముక్కలు, కాగితాల చెత్త, దారాలు– ఎవరో తుడవడం మొదలెట్టారు. రాజారావు హాల్లోకొచ్చి బల్లమీద నడుంవాల్చాడు. అతనికి భయమేసింది ఎందుకో!

చివాలున లేచి హోల్డాలు, పెట్టె అతనే తీసుకొని గేటుదాకా నడిచి వెళ్ళాడు. బండిని ఆపుచేసి అందులో సామాను పెట్టించాడు. నీలకంఠం గుమాస్తా వొచ్చాడు.

"అయ్యగారు కలెక్టరుగారితో వెళ్ళారు. చెప్పకుండానే వెళ్ళిపోతారా?"

'ఏముంది చెప్పేటందుకు? బండికి టైమయింది. మరీ మరీ అడిగానని చెప్పండి... అమ్మగారితో... కూడా.'

"అమ్మగారు రెండురోజులవరకు రామని టెలిగ్రాం ఇచ్చారండి."

రాజారావు బండిలోకి ఎక్కాడు. తనవూరికి చేరుకున్నాడు. రైల్లో ఆలోచించి ఒక నిశ్చయానికొచ్చాడు. తన బ్రతుకంతా అబద్ధాల కూర్పు. ఆ మాటకొస్తే నీలకంఠం, సుమిత్రల బ్రతుకూ అంతే. అంతా అసత్యాల అల్లిక, నటన, దగా, సంస్కారంతోబాటు నటన, దగా, అబద్ధాలు ఎదుగుతూ ఉంటాయి. తన జీవిత విధానమే మార్చివేయాలి. అబద్ధాలాడకూడదు. భార్యకి అంతా పూసగుచ్చినట్లు చెప్పివెయ్యాలి. ఏదీ దాచకూడదు. అన్నీ చెప్పివేసి భార్యవొడిలో మొహం దాచుకొని ఏడవాలి. ఆమె కరిగిపోయి, మొహాన్ని చేతుల్లోకి తీసుకుని, కళ్ళల్లోకి చూచి, క్షమించి నిజంగా ఆప్యాయత చూపుతుంది. అతనామె నింకెప్పుడూ మోసం చేయకూడదు.

ప్లాట్‌ఫారం గేట్లో పరధ్యాన్నంగా టిక్కెట్టు బదులు అగ్గిపెట్టె నిచ్చాడు, టికెట్ కలెక్టరుకి.

ఇంటికి వెళ్ళాడు. భార్యతో అనుకున్నట్లు అంతా చెప్పి ఆమె ఒడిలో మొహం దాచుకొని ఏడ్చాడు.

ఆమె నవ్వుతూ అన్నది.

"మీకు పరీక్షలు లేవని, వూరెళ్ళాల్సిన పనిలేదని నాకు తెలుసు. మీ స్టూడెండొకడు చెప్పాడు. మీ కొచ్చిన ఆహ్వానం చూశాను. మీ రెందుకెళ్ళారో నాకు తెలుసు. ఏం జరుగుతుందో చూద్దామని నేను తెలియనట్టు అబద్ధమాడాను. చంద్రన్నగాడి వన్నీ అబద్ధాలు ఒక్కమాటా నమ్మకండే" అని నవ్విపారేసింది. చంద్రన్న అబద్ధమాడడని నాకెందు కనిపించిందో ఇంత వరకూ బోధపడలేదు. నిజాన్ని నిజమే కనుక్కోవాలి.

* * *